
సాక్షి ఒడిశా

మంగళవారం । 4 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,05,625లు, బంగారం 100 మిల్లీగ్రాములు, వెండి 7.5గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి పూజలు

-IIలో



కలెక్టర్ గ్రీవెన్స్‌కు స్పందన

-IIలో

చేపలే.. చేదోడు!



హేచరీలో పెరుగుతున్న గంబూసియా చేపపిల్లలు

- మలేరియా, డెంగీ వ్యాధుల నియంత్రణకు విస్తృత చర్యలు
- పంచాయతీల్లో గంబూసియా హేచరీల ఏర్పాటుకు సన్నాహాలు
- నీటినిల్వ ప్రాంతాల్లో విడిచి పెట్టడం ద్వారా దోమల వ్యాప్తికి అడ్డుకట్టు
- రాయగడ ఏడీఎం డాక్టర్ బీఎల్ఎన్ వృష్టి



రాయగడ: జిల్లాలో మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ప్రప్రథమంగా రాయగడలో గంబూసియా చేపల పెంపకానికి అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీని ద్వారా దోమలను అంతం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టామని ఏడీఎం వెక్టర్ బోర్న్ డీసీజ్(వీబీడీ) డాక్టర్ లక్ష్మీనారాయణ వృష్టి తెలిపారు. మున్సిపాలిటీ, జిల్లా ఆరోగ్యశాఖ సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రక్రియలో భాగంగా పట్టణంలో మురుగునిల్వ ఉండే ప్రాంతాల్లో గంబూసియా రకం చేప పిల్లలను విడిచి పెట్టడంతో దోమల సంతానవృద్ధి తగ్గుముఖం పడుతుందన్నారు. దీంతో మలేరియా, డెంగీ వ్యాధులను నియంత్రించేందుకు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు.

రూ.3.50 లక్షల వ్యయంతో..

రాయగడ పట్టణంలో దాదాపు ఈ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో త్వరలో జిల్లాలోని అన్ని పంచాయతీల్లో గంబూసియా చేపపిల్లల హేచరీలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రాస్పత్రి కార్యాలయం ప్రాంగణంలో 3నెలల క్రితం సుమారు రూ.3.50 లక్షల వ్యయంతో హేచరీ ఏర్పాటు చేశారు. బరంపురం, కంధమాల్ ప్రాంతాల నుంచి గంబూసియా రకం చేప పిల్లలను తీసుకువచ్చి, హేచరీలోవిడిచి పెట్టారు. మూడు నెలల్లో ఈ చేపపిల్లల సంతానం వృద్ధి కావడంతో వీటిని పట్టణంలోని మురుగు నిల్వల ప్రాంతాల్లో విడిచి పెడుతున్నారు.

25 ప్రాంతాల గుర్తింపు..

మున్సిపాలిటీ పరిధిలో సుమారు 25 ప్రాంతాలను ఇప్పటికే గుర్తించి గంబూసియా చేపపి ల్లలను ఆయా ప్రాంతాల్లో విడిచి పెడుతున్నారు. వీటి వల్ల పట్టణంలో దోమల బెడద దాదాపు తగ్గుముఖం పడుతుందని అధికార యంత్రాంగం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. త్వరలో బరంపురంలోని వెక్టర్ కంట్రోల్ పరిశోధనా కేంద్రానికి చెందిన కొంతమంది నిపుణులను ఇక్కడకు తీసుకు వచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం రాయగడలోని వివిధ ప్రాంతాల్లో దోమల నివారణకు సంబంధించి వేసిన గంబూసియా చేపపిల్లల ద్వార దోమల సంఖ్య ఎంత వరకు తగ్గుముఖం పట్టిందన్న విషయాన్ని నిపుణుల బృందం అంచనా వేస్తారు. ఇప్పటికే బరంపురం, కంధమాల్ వంటి ప్రాంతాల్లో ఈ ప్రక్రియ ద్వారా ఉత్తమ ఫలితాలు రావడంతో ఇక్కడ కూడా ఫలితాలు ఆశాజనకంగా ఉండ వచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలోని కో–ఆపరేటివ్ 2, 3 కాలనీల్లో గంబూసియా చేపపిల్లలను చైర్మన్ మహేష్ పట్నాయక్ వారం క్రితం విడిచి పెట్టారు. మరికొద్ది రోజుల్లో మరో 25 ప్రాంతాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ఆధునీకరించేందుకు సన్నాహాలు ప్రారంభించామని, దీని వల్ల కాలువల్లో నీటి నిల్వ సమస్య తీరడంతో పాటు పారిశుద్ధ్య సమస్య తీరతుందని ఆయన వివరించారు.



డ్రైనేజీలో గంబూసియా చేపలను విడిచిపెడుతున్న మున్సిపాలిటీ చైర్మన్ పట్నాయక్



సీడీఎంఓ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హేచరీ

రాష్ట్రంలో డెంగీ ముప్పు

- భయపడాల్సింది లేదు: ఆరోగ్యశాఖ

భువనేశ్వర్: రుతు పవనాల ప్రారంభంతో రాష్ట్రమంతటా డెంగీ కేసుల సంఖ్య పెరుగుతోంది. రాజధాని నగరం భువనేశ్వర్‌లో ఈ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. జూలై నుంచి సెప్టెంబర్ మధ్య ఈ కేసుల సంఖ్య పెరగవచ్చు. అయితే ఈ ఏడాది ఇంతవరకు డెంగీ కేసులు పెరగలేదని రాష్ట్ర ఆరోగ్యశాఖ తెలిపింది. గతం కంటే ఈ ఏడాది రాష్ట్రంలో డెంగీ పరీక్షలు పెరిగాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది కంటే సమగ్ర పాజిటివ్ రేటు చాలా తక్కువగా ఉందని ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా సోమవారం ప్రకటించారు. దాదాపు గత ఏడాది కంటే పాజిటివ్ కేసులు సగానికి తగ్గాయని ధైర్యం చెప్పారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో ఇప్పటి వరకు 11,464 పరీక్షలు నిర్వహించగా 185 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఖుర్దా జిల్లా, భువనేశ్వర్ నుంచి అత్యధికంగా 96 కేసులు ఖరారు కావడం ఆందోళనకర పరిస్థితికి దారి తీస్తోంది. గత ఏడాది ఇదే సమయానికి 5,981 నమూనా పరీక్షలు నిర్వహించగా 353 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత సంవత్సరం కంటే పరీక్షల సంఖ్య రెట్టింపై, పాజిటివ్ రేటు తక్కువగా ఉన్నట్లు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు.

డెంగీ హాట్‌స్పాట్..

రాష్ట్రస్థాయిలో భువనేశ్వర్ డెంగీ హాట్‌స్పాట్‌గా బెంబేలెత్తిస్తోంది. ఖుర్దా జిల్లాలో కేసులు ఎక్కువగా భువనేశ్వర్‌కు చెందినవి కావడంతో, పౌర అధికారులు పాతబస్తీ, సాలియా సాహి, ఐఆర్‌సీ విలేజ్ ప్రాంతాలను రాజధాని నగరంలోని మూడు హాట్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఈ పరిస్థితి నియంత్రణకు భువనేశ్వర్ నగరపాలక సంస్థ(బీఎంసీ) పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేసింది. పారిశుద్ధ్య చర్యలను వేగవంతం చేయడమే కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాల్లో భారీగా చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. ఫాగింగ్ చర్యలు ముమ్మరం చేశారు. కొన్ని ప్రదేశాలు హాట్‌స్పాట్ జోన్‌గా మారగా.. పౌర సంఘం ఈ ప్రాంతాలపై దృష్టి సారించింది. డెంగీ కారక దోమల సంతానోత్పత్తి, వనరులను గుర్తించి తొలగించేందుకు సాధ్యమైన అన్ని చర్యలను తీసుకుంటోందని బీఎంసీ వర్గాలు తెలిపాయి. డెంగీ, వెక్టార్ ద్వారా సంక్రమించే వ్యాధులను ప్రేరేపించే ఈడిస్ ఈజిప్టి దోమ నేల ఉపరితలాలపై పేరుకుపోయిన స్వచ్ఛమైన నీటిలో సంతానోత్పత్తి చేస్తుంది. ఈ నేపథ్యంలో ఆయా పరిసరాల్లోని వాటర్ కూలర్లు, పాత టైర్లు, నీటికుంటలు లేదా మురుగు నీల్వ ప్రదేశాలను తొలగించాలని ఆరోగ్యశాఖ, బీఎంసీ అధికారులు ప్రజలను కోరారు. ముందు జాగ్రత్త చర్యగా అన్ని జిల్లాలకు ప్రామాణిక ఆపరేటింగ్ విధానం(ఎస్ఓపీ) జారీ చేశారు. డెంగీ ఆకస్మిక విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు వీలుగా పడకలు, మందులు, ప్లేట్‌లెట్ల నిల్వను సిద్ధంగా ఉంచుకోవాలని ఆస్పత్రులు, వైద్య కళాశాలలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



భువనేశ్వర్ ఐఆర్‌సీ ప్రాంతంలో ఫాగింగ్ చేస్తున్న బీఎంసీ సిబ్బంది

న్యూస్‌రీల్

యథాతథంగా కాళీ మందిరం

- స్పష్టంచేసిన కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు

రాయగడ: స్థానిక సమితి కార్యాలయానికి సమీపంలోని ప్రఖ్యాత కాళీ మందిరాన్ని ఎట్టి పరిస్థితిల్లోనూ పడగొట్టే యోచన లేదని, అవసరమైతే అభివృద్ధికి తమవంతు సహకరిస్తామని జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ ఫిర్యాదు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చెందిన సిబ్బంది మందిరాన్ని తొలగించేందుకు కొలతలు వేసేందుకు సిద్ధపడగా, స్థానికులు పెద్ద ఎత్తున ప్రతిఘటించడంతో వారు వెనుదిరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, సామాజిక కార్యకర్తలు, పుర ప్రముఖులు జిల్లా యంత్రాంగం చేస్తున్న సన్నాహాలను నిలిపి వేయాలని కోరుతూ కలెక్టర్‌ను సోమవారం కలిసి, వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఆమె.. పైవిధంగా సమాధానమిచ్చారు. మందిరం అభివృద్ధికి తమవంతు సహకారం అందించడంతో పాటు నిధుల కేటాయింపులకు సంబంధించి సిఫార్సు చేస్తానని భరోసా ఇచ్చారు. దీంతో అక్కడ ఉన్న వారంతా హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శివాజీ దాస్, భీష్మా భక్షి పాత్రొ, సంతోష్ దొలాయి, దీపక్ వృష్టి, జనమేజయ్ స్వాయి తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు


రాయగడ: పట్టణంలోని గౌతంనగర్‌లో సదర్ పోలీసులు ఆదివారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. 5వ లైన్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు సరుకు రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ ఎస్ఆర్ టిర్కీ నేతృత్వంలో సిబ్బంది దాడులు చేపట్టి, 7.7 కిలోలు లభించిందని ఐఐసీ కమలాకాంత్ కుహూరా సోమవారం తెలిపారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించామన్నారు. నిందితులు కొద్దికాలంగా గంజాయి కొనుగోలు చేసి, అద్దె ఇంట్లో దాచి ఉంచిన అనంతరం అధిక మొత్తానికి విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఝార్సుగుడ నుంచి స్పైస్‌జెట్ సేవలు



భువనేశ్వర్: ఝార్సుగుడ వీర్ సురేంద్రసాయి విమానాశ్రయం నుంచి కోల్‌కతా, విశాఖపట్నం ప్రాంతాలకు విమానయాన సౌకర్యం అతి త్వరలో అందుబాటులోకి రానుంది. బడ్జెట్ క్యారియర్ స్పైస్‌జెట్ సంస్థ ఈ మేరకు ఏర్పాట్లు దాదాపు పూర్తి చేసింది. ఈనెల 10 నుంచి ఈ సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఈ విమానాశ్రయం నుంచి నిలిపి వేసిన చెన్నై, బెంగళూర్‌కు విమానయాన సేవలు పునరుద్ధరించేందుకు నిర్ణయించారు. సుమారు ఏడాదిగా ఈ సేవలు నిలిపి వేశారు. ఝార్సుగుడ వీర్‌సురేంద్ర విమానాశ్రయం నుంచి చెన్నైకి వారానికి మూడుసార్లు, బెంగళూర్‌కు వారానికి 4సార్లు విమానయాన సౌకర్యం అందుబాటులో ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఎయిర్‌లైన్స్ ఎయిర్‌పోర్టు అధికారులు ప్రతిపాదనలు ఆమోదించడంతో పునరుద్ధరణకు మార్గం సుగమమైంది. ప్రస్తుతానికి ఈ విమానాశ్రయం నుంచి ఇప్పుడు భువనేశ్వర్, కోల్‌కతా ప్రాంతాలకు ఎయిర్ ఇండియా, హైదరాబాద్, ఢిల్లీ ప్రాంతాలకు స్పైస్‌జెట్ విమాన సేవలు అందుబాటులో ఉన్నాయి.

కాశీ అన్నపూర్ణేశ్వరిగా శాంతమ్మ



బరంపురం: దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధి చెందిన మాబుడి శాంతమ్మ సోమవారం కాశీ అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పౌర్ణమి నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది చేరుకొని, మొక్కుబడులు చెల్లించుకున్నారు.

అంధ, బధిరుల పాఠశాల ప్రారంభం



బధిర, అంధుల పాఠశాలను ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న విద్యార్థులు

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని నగరంలోని యూనిట్–3 భీమ్ భోయ్ అంధ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బిపిన్‌బిహారీ చౌదరి ప్రభుత్వ ఉన్నత బధిర పాఠశాలను వృత్తి విద్య ఉన్నత పాఠశాలలను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారం ప్రారంభించారు. దీని ద్వారా రాష్ట్రంలోని దృష్టి, వినికిడి లోపం ఉన్న చిన్నారులు వసతి గృహంలో ఆశ్రయం పొందుతూ చదువుకునే అవకాశాన్ని పొందుతారు. ఇంతకు ముందు వీరంతా సాధారణ వర్గం పిల్లల కోసం ఉద్దేశించిన ఉన్నత పాఠశాలల్లోనే అభ్యసించాల్సి వచ్చేది. 'వారికి అనుకూలమైన ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చే'దని సీఎం తెలిపారు. ఈ విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు, వృత్తి విద్యలో సాంకేతిక సమాచార వ్యవస్థ ద్వారా ప్రత్యేక శిక్షణ సులభతరం చేశామన్నారు. ఈ సందర్భంగా దృష్టి లోపం ఉన్న పిల్లల కోసం ఆడియో స్టూడియో, వినికిడి లోపం ఉన్న పిల్లల కోసం వర్చువల్ స్టూడియోను ప్రారంభించారు. దీంతో పాటు రెండు పాఠశాలల్లోని పిల్లలందరికీ కొత్త స్కూల్ బ్యాగులు, బ్రాస్‌లెట్లు, అంధ పిల్లలకు వివిధ రకాల ఆట వస్తువులను పంపిణీ చేశారు.

విషపూరిత పుట్టగొడుగులు తిని అస్వస్థత

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 9మంది బాధితులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

జయపురం: విషపూరిత పుట్ట గొడుగులు తిని 9మంది అస్వస్థతకు గురయ్యారు. జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి పెందపాడ పంచాయతీ ముర్కిగుడ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని భగవతీ పెందాపాడియ ఇంట్లో సోమవారం పెళ్లిచూపులు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో వధువు తరుపు వారు మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈలోగా కొంత మంది పిల్లలు గ్రామం సమీపంలోని చెరువు వద్దకు స్నానాలకు వెళ్లి, తిరిగి వస్తున్న సమయంలో పుట్ట గొడుగులు కనిపించారు. వాటిని సేకరించి, వంటలో ఉపయోగించారు. వీటితో మధ్యాహ్న భోజనం చేసిన వారు వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. బాధితులను వెంటనే బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఏడుగురు ఆరేళ్ల లోపు చిన్నారులు కాగా, 40 ఏళ్ల వ్యక్తి, ఇద్దరు వృద్ధులు ఉన్నారు. పరీక్షించిన వైద్యులు.. విషపూరిత పుట్టగొడుగు తినడంతో అస్వస్థతకు గురయ్యారని వెల్లడించారు. అయితే ప్రాణాపాయం లేదని స్పష్టంచేశారు. ఈమేరకు వైద్యుల బృందాన్ని ముర్కిగుడ గ్రామానికి పంపించామని డాక్టర్ అధిరాజు సాహు తెలిపారు.

నిర్లక్ష్యానికి తార్కాణం

- హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో గ్యాస్ సిలీండర్ రవాణా

భువనేశ్వర్: వివిధ ప్రాంతాల్లో తరచూ రైలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా.. రైల్వే యంత్రాంగం స్పందన కొరవడుతోంది. భద్రత, రక్షణ చర్యలు రోజురోజుకూ దిగజారి పోతున్నాయి. ఈ చర్యల ప్రభావంతో ఘోరమైన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రాణహానితో అపార ఆస్తినష్టం తలెత్తుతోంది. ఈ నష్టం భర్తీ చేయలేని రైల్వేశాఖ ప్రమాదాల నివారణ పట్ల చేపడుతున్న చర్యలు శూన్యంగా పరిణమిస్తున్నాయి. భువనేశ్వర్(తూర్పు కోస్తా రైల్వే ప్రధాన కేంద్రం) రైల్వేస్టేషన్ జగదల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్(18447) రైలులో గ్యాస్ సిలీండర్ అక్రమ రవాణే దీనికి నిలువెత్తు తార్కాణంగా చెప్పవచ్చు. అగ్నిప్రమాద, సంబంధిత సామగ్రి రైలులో తరలించడంపై నిషేధాజ్ఞలు ఉన్నాయి. ఘోర ప్రమాదాల ప్రేరణగా రైల్వేశాఖ తరచూ ప్రసార మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ వాస్తవ ఘటనల పట్ల శీతకన్ను దాటవేయడం ప్రాణాంతక విపత్కర పరిస్థితులను ప్రోత్సహిస్తోంది. హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో సిలీండర్ రవాణా నివారణ చర్యలు చేపట్టాల్సిన రైల్వే రక్షకదళం(ఆర్‌పీఎఫ్) వర్గాలు నిర్లక్ష్య వైఖరే దీనికి కారణమని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. అలాగే రైలు వెనుక నుంచి రెండో జనరల్ బోగీలో భారీ ఎత్తున గ్యాస్ సిలీండర్లు తరలించడంతో కనీసం నిల్చొని ప్రయాణిచేందుకు కూడా స్థలం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.



హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో దర్శనమిచ్చిన గ్యాస్ సిలీండర్

కలెక్టరేట్ ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న బీకేఎంయూ ప్రతినిధులు

పర్లాకిమిడి: జిల్లాలో ఇళ్లు లేని పేదలు, గిరిజనులు, దళితులకు ప్రధానమంత్రి ఆవాజ్ యోజనా పథకం ఇళ్లను మంజూరు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం వివిధ సమితిలలో ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చిన స్థలాలను పేదలకు కేటాయించాలని విన్నవించారు. నిరసనలో బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జొన్న సుభాష్ చంద్రరావు పాల్గొని, కలెక్టర్ స్మితిరంజన్ ప్రధాన్‌కు వినతి పత్రం అందించారు. బీకేఎంయూ సభ్యులు ఎం.జగన్నాథం, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి నుంచి ఆర్థికసాయం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్

రాయగడ: కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ అధ్యక్షతన డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా ఏడుగురు నిరుపేదలకు సీఎం సహాయ నిధి నుంచి రూ.80 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మరో ఇద్దరికి చికిత్స నిమిత్తం రెడ్‌క్రాస్ నుంచి రూ.10 వేల చొప్పున అందజేశారు. ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావడంతో సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ వారం 64వినతులను కలెక్టర్ స్వీకరించగా, ఇందులో 19 గ్రామ సమస్యలు, మరో 45వ్యక్తిగత సమస్యలుగా గుర్తించారు. వినతులను స్వీకరించిన ఆమె.. వీటిని పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ విష్ణుచరణ్ పాత్రొ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి రవినారాయణ త్రిపాఠి, ఐటీడీఏ అధికారి దిలీప్‌కుమార్ బెహరా, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా చంపకేశ్వర మందిర ప్రతిష్ఠ



జయపురం: సబ్ డివిజన్ పరిధి కొట్‌పాడ్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్(ఎన్ఏసీ) పరిధి బాహరఘుడా సాహి సమీపంలోని చంపాఘాట్‌పై సోమవారం చంపేశ్వర మహాదేవ్ ఆలయ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. కొట్‌పాడ్ గణేష్ మందిర అర్చకులు సూర్యనారాయణ పర్యవేక్షణలో శాస్త్రోత్సంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ, త్రిముఖ చంపేశ్వర మహాదేవ్ లింగస్థాపన చేపట్టారు. కార్యక్రమాన్ని కె.భువనేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, గోపాలరావు, రాణు పాఢి తదితరులు పర్యవేక్షించారు. కొట్‌పాడ్ సత్యసాయి సేవాసమితి బాహరఘుడా సాహి యువసమాజ్ అన్నదానం జరిపారు.

టికిరిలో వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న ఏసీఎఫ్ దివ్యమాధురి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం సోమవారం చేపట్టారు. టికిరి పంచాయతీలోని పితాజోడి, గోరఖ్‌పూర్, బంకాంబ ప్రాంతాల్లో ఉన్న కొండలపై సుమారు 3వేల మొక్కలు నాటారు. టికిరి రేంజ్ అటవీశాఖ అధికారి డొంబురుధర్ సేనాపతి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పర్యావరణం పరిరక్షణకు అంతా కృషి చేయాలని ఈ సందర్భంగా ఏసీఎఫ్ దివ్యమాధురి శెఠి అన్నారు. పర్యావరణ సమతుల్యానికి మొక్కలు ఎంతో దోహద పడతాయని, ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు.

శాకంబరిగా పైడితల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు సోమవారం గురు పౌర్ణమి పర్వదినాన శాకంబరి దేవీగా వనంగుడిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మూలాపాపారావు, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని కూరగాయలతో సర్వాంగ సుందరంగా శాకంబరిమాతగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

విజయనగరం ఫూల్‌బాగ్: ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్‌పై పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాలు, విజయనగరం జిల్లాలోని 27 మండలాల్లోని 10,637 మంది ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 నుంచి 16వ తేదీ వరకు ఏడు ఇంజినీరింగ్ కాలేజీల్లో (తగరపువలస, గరివిడిలోని అవంతి, రాజాంలోని జీఎంఆర్, విజయనగరంలోని జేఎన్‌టీయేకే, జొన్నాడ వద్ద ఉన్న లెండి, చింతలవలసలోని ఎంవీజీఆర్, గాజులరేగ వద్ద ఉన్న సీతం) 15 విడతల్లో 279 బ్యాచ్‌లుగా శిక్షణ సాగుతుందన్నారు. ఒక్కో బ్యాచ్‌లో గరిష్టంగా 40 మందికి శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్ ఉపయోగించే విధానం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్ ఉపయోగించి బోధన చేసే విధానం, బైజూస్ టాబ్స్‌లో కంటెంట్ ఉపయోగించి ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్‌లో బోధించే విధానంపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు

జామి: అలమండ సంతకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టడంతో కొట్యాడ గ్రామానికి చెందిన కొట్యాడ బంగారయ్య, కుమారుడు అప్పల ఈశ్వరరావు తీవ్ర గాయాల పాలయ్యారు. గొడికొమ్ము పెద్ద చెరువు వద్ద బైక్‌ను బొలెరో ఢీకొట్టడంతో బోల్తా పడడంతో ప్రమాదం జరిగింది.



రాయగడ: పూజలు చేస్తున్న మహిళలు



ఖుర్దారోడ్ నీలాచల్ షిర్డీసాయి మందిరంలో గురు పూర్ణిమ పూజలు



రాయగడ: హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- ఆలయాల్లో భక్తుల పూజలు
- నవరంగ్‌పూర్‌లో షిర్డీసాయి సేవలో ఎంపీ, ఎమ్మెల్యేలు



బరంపురం: ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు



బరంపురం: పూజలందుకుంటున్న జగన్నాథ, బలభద్ర, సుభద్రా మూర్తులు



ఎంపీ రమేష్ మాఝికి బాబా ఫొటో అందిస్తున్న కమిటీ సభ్యులు

కొరాపుట్: గురు పూర్ణిమ పూజలు వివిధ ప్రాంతాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చైనా మార్కెట్‌లో షిర్డీసాయి మందిరంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు విరాళంగా అందించిన 30కిలోల వెండితో తయారైన సింహాసనం నుంచి బాబా భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం 2116 లీటర్ల పాలతో క్షీరాభిషేకం, మధ్యాహ్నం 10 వేల మందికి అన్నదానం జరిపారు. సుమారు మూడేళ్ల తర్వాత పౌర్ణమి వేడుకలు జరుగడంతో కొరాపుట్, నవరంగ్‌పూర్ జిల్లాల నుంచి వేలాదిమంది దర్శనానికి తరలివచ్చారు. నవరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్‌చంద్ర మాఝి పాల్గొని, బాబాను దర్శించుకున్నారు. ఆలయ మరమ్మతుల నిమిత్తం ఆర్థికసాయం అందించాలని కమిటీ సభ్యులు కోరగా.. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్ హాజరై, పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తన కోటా నిధుల నుంచి రూ.3 లక్షల కేటాయిస్తానని హామీ ఇచ్చారు. దాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి కుటుంబసమేతంగా బాబాను దర్శించుకున్నారు. నవరంగ్‌పూర్ మున్సిపాలిటీ చైర్మన్ కును నాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖులకు సాయి విగ్రహాన్ని కమిటీ సభ్యులు అందజేశారు. సాయంత్రం పఠాన్‌వీధి, గాంధీ జంక్షన్, మెయిన్‌రోడ్డు, జగన్నాథ మందిరం మీదుగా శోభ యాత్ర చేపట్టారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు కొత్తకోట శ్రీనివాసరావు, మాదేటి కృష్ణారావు, అమనాన సింహాచలం, అమనాన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: పవిత్ర గురుపౌర్ణమి పురస్కరించుకుని స్థానిక రైల్వే రిక్రియేషన్ క్లబ్ సమీపంలోని షిర్డీసాయి మందిరంలో విశేష పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, పుష్పార్చన నిర్వహించారు. అనంతరం మందిరంలో హోమం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో మందిరానికి చేరుకొని, బాబా దర్శనం పొందారు. నిర్వాహకులు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బరంపురం: నగరంలోని ఖస్పా వీధిలో జరిగిన బొమ్మల పౌర్ణమి సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ సందర్భంగా శ్రీక్షేత్ర జగన్నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంబరాల్లో వివిధ రకాల బొమ్మల విక్రయాలు జోరుగా సాగాయి. శతాబ్దకాలంగా నగర ప్రజలు జగన్నాథ రథయాత్ర ముగింపు సందర్భంగా బొమ్మల పౌర్ణమి సంబరాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సంబరాల్లో అధిక సంఖ్యలో నగర ప్రజలు తమ కుటుంబాలతో పాల్గొని, ఉత్సాహంగా గడిపారు.

భువనేశ్వర్: ఖుర్దారోడ్ ట్రాఫిక్ కాలనీ నీలాచల్ షిర్డీ సాయి మందిరంలో గురుపూర్ణిమ ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం క్షీరాభిషేకం, హోమం చేపట్టగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సర్వదర్శనం పురస్కరించుకుని సంధ్య వేళలో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. నారాయణ సేవలో వందలాది భక్తులు పాల్గొన్నారు.

జయపురం: పట్టణంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగ శిక్షకులు పి.తిరుమల, వక్త అరుణకుమార్ నాయక్, పట్టణ పరిచాలకులు డాక్టర్ నిరంజన్ మిశ్రా, విష్ణుప్రసాద్ సాహు గురుపూర్ణిమ ప్రాధాన్యతను వివరించారు. జయపురం మహాత్మాగాంధీ రోడ్డు డెప్పిగుడ ప్రాంతంలోని సాయిబాబా మందిరం భక్తులతో పోటెత్తింది. దీపారాధనతో పాలు ప్రత్యేక పూజలు జరిపి, బాబాను దర్శించుకున్నారు.



జయపురం: బాబాకు పూజలు చేస్తున్న భక్తులు



జయపురం: గురుపూర్ణిమ ఉత్సవంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ సభ్యులు



బాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్



బరంపురం: బొమ్మలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

అవిశ్రాంత కానుక

- ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పింఛన్ స్కీం
- రాష్ట్రప్రభుత్వం సరికొత్త ఒరవడికి శ్రీకారం
- నెరవేరనున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల చిరకాల స్వప్నం
- మూడో విడతగా ఈ నెల 11 వరకు నమోదు చేసుకునే అవకాశం
- మన్యం జిల్లాలో 1081 మంది ఉద్యోగులకు ప్రయోజనం
- ఇదో అద్భుత అవకాశంగా పేర్కొంటున్న ఉద్యోగులు



పార్వతీపురం ఆర్టీసీ బస్‌స్టాండ్

పార్వతీపురం టౌన్:

అన్నివర్గాల ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఏదో ఒక రూపంలో లబ్ధిచేకూర్చుతోంది. నాలుగేళ్లుగా సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తోంది. ప్రజల జీవన ఉన్నతికి పాటుపడుతోంది. అందులో భాగంగానే దేశంలో ఎక్కడాలేని విధంగా ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ఉద్యోగ విరమణ పొందిన వారి సంక్షేమానికి మరో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకూ ఈ సంస్థలో పని చేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం అరకొరగా పెన్షన్ అందేది. ఆ విధానానికి చరమగీతం పాడి అధిక పెన్షన్ స్కీమ్ (హయ్యర్ పెన్షన్)కు ప్రభుత్వం నూతన ప్రణాళిక సిద్ధం చేసింది. ఆర్టీసీ ఉద్యోగి పదవీ విరమణ అనంతరం అధిక మొత్తంలో పెన్షన్‌ను జీవితాంతం అందుకునేందుకు అవకాశం కలుగుతుంది. గతంలో ఉద్యోగ విరమణ అనంతరం కనీసం రూ. మూడు వేల పెన్షన్ మాత్రమే పొందేవారు. ఈ హయ్యర్ పెన్షన్ స్కీమ్ ద్వారా ఇప్పటి వరకూ అందే పెన్షన్ కన్నా 5 నుంచి 6 రెట్లు వరకూ పెరిగే అవకాశం ఉంది.

జీవితానికి భరోసా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో ఉద్యోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం కల్పించింది. 2014 సెప్టెంబర్ 1 నాటికి ఆర్టీసీ ఉద్యోగిగా విధుల్లో చేరిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ మెకానిక్‌లు, సెక్యూరిటీ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది అర్హులు. పథకంలో నమోదుకు మొదటి విడత ఏప్రిల్ 3 నుంచి మే 3 వరకూ, రెండో విడత మే 4వ తేదీ నుంచి జూన్ 26 వరకూ అవకాశం కల్పించింది. కొద్దిమంది ఉద్యోగులు సాంకేతిక లోపం కారణంగా సరైన వివరాలు నమోదు చేయకపోవడం, మరికొంత మంది దరఖాస్తులు తిరస్కరణకు గురవడంతో మరో అవకాశం ఇచ్చింది. మూడో విడతగా జూన్ 27 నుంచి జూలై 11వ తేదీ గడువు ఇస్తూ నమోదు చేసుకోవాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు పూర్తి స్థాయిలో నమోదు చేసుకున్నాక వారి బేసిక్ స్కేల్‌ను అనుసరించి ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ లెక్కలు కట్టి ఉద్యోగులకు చెల్లించే మొత్తాన్ని ప్రకటించనుంది.

జిల్లాలో ప్రయోజనం చేకూరనున్న ఆర్టీసీ ఉద్యోగుల సంఖ్య ఇలా...

ఆర్టీసీ డిపో	ఉద్యోగులు
పాలకొండ	403
పార్వతీపురం	369
సాలూరు	294
ఆఫీస్ సిబ్బంది	15
మొత్తం	1081

అవగాహన కల్పించాం



ఆర్టీసీ ఉద్యోగులకు ఇదో అద్భుత పథకం. పార్వతీపురం మన్యం జిల్లాలోని మూడు డిపోల పరిధిలో 1081 మంది ఉద్యోగులు హయ్యర్ పెన్షన్ పథకంలో నమోదుకు అవగాహన కల్పించాం. దీనిని వారు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాం. ఉద్యోగుల దరఖాస్తులను నమోదు చేస్తున్నాం. రెండు రోజుల్లో నమోదు ప్రక్రియ పూర్తి చేయిస్తాం. ఆర్టీసీ ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– టీవీఎస్ సుధాకర్, జిల్లా ప్రజారవాణా అధికారి, పార్వతీపురం మన్యం

కలెక్టర్ గ్రీవెన్స్‌కు స్పందన



గ్రీవెన్స్‌లో వినతులు ఆలకిస్తున్న కలెక్టర్ శ్రితిరంజన్



సీఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ హాలులో జాయింట్ గ్రీవెన్స్‌సెల్ సోమవారం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, అటవీశాఖ డివిజనల్ అధికారి ఎస్.ఆనంద్, ఏడీఎం రాజేంద్ర మింజ్, సీడీఎంఓ డాక్టర్ పీకే పాత్రొ పాల్గొన్నారు. గ్రీవెన్స్‌కు స్థానిక మున్సిపాలిటీతో పాటు కత్తుల కవిటి, బాగుసల, రాణిపేట, సిద్ధమణుగు తదితర గ్రామాల నుంచి మొత్తం 97 వినతులు అందాయి. వీటిలో వ్యక్తిగత సమస్యలు 84, గ్రామ సమస్యలు 13 ఉన్నాయి. 26 ఫిర్యాదులను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ బెహరా, గుసాని సమితి బీడీఓ నీలమాధవ మాఝి, ప్రజా అభియోగాల నోడల్ అధికారి నర్మదా నాయక్, ఇతర ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు.

తల్లి ఆత్మహత్య

- కుమార్తె ఆత్మహత్యాయత్నం

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీకి చెందిన మహిళ వ్యక్తిగత కారణాలతో సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో విషయం తెలుసుకున్న మృతురాలి కుమార్తె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గాంధీనగర్ కాలనీకి యువతి బొట్టా సాయిలీల హైదరాబాద్‌లోని ప్రైవేట్ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తోంది. తాను ఓ వ్యక్తిని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని ఇటీవల ఆమె ఇంట్లో చెప్పింది. తల్లి సత్యవతి(45)కి ఈ విషయం నచ్చకపోవడంతో ఇద్దరి మధ్య వివాదం జరిగింది. దీంతో తల్లి సత్యవతి సమీపంలోని రైల్వేట్రాక్ వద్దకు వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు రైల్వేట్రాక్‌పై ఉన్న మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లి గుట్టు చప్పుడు కాకుండా అంత్యక్రియలు నిర్వహించారు. కాగా తల్లి ఆత్మహత్య చేసుకుందని విషయం తెలుసుకున్న కుమార్తె మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు అపస్మారక స్థితిలో ఉన్న సాయిలీలను చికిత్స నిమిత్తం స్థానిక మిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిలీల

మాతాశిశు సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

- గర్భిణులు, బాలింతలకు ఇంటికే పౌష్టికాహార సరుకులు
- ప్రతినెలా వైద్య తనిఖీలు
- ఊరిలోనే ఫ్యామిలీ డాక్టర్‌తో వైద్యం
- ఉచితంగా మందులు అందజేత
- గతంలో కేవలం రూ.250 విలువ చేసే బేబీకిట్టు
- ఇప్పుడు బాలింత ఖాతాల్లో రూ.5వేలు జమ
- తల్లీపిల్లలను సురక్షితంగా ఇంటికి చేర్చుతున్న తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్



జిల్లా ఆస్పత్రిలో ప్రసూతి విభాగం

పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం మాతాశిశు సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. గర్భిణి నుంచి సుఖప్రసవమయ్యేవరకు వైద్య, ఆరోగ్య సేవలందిస్తోంది. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లోనూ నెలనెలా వైద్యపరీక్షలు చేయిస్తోంది. గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారంతో పాటు మందులు అందజేస్తోంది. అవసరమైన వారికి ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యులు ఇంటికి వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు 'నాడు–నేడు' నిధులతో ఆధునిక సొబగులు అద్దడం, పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించడం, ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడంతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. దీంతో ఇటీవల కాలంలో ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ సంఖ్య రెట్టింపు నమోదవుతోంది. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కుదరడం, జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ప్రజారోగ్యంపై చూపుతున్న శ్రద్ధకు ప్రశంసలు అందుతుండడాన్ని పచ్చపత్రిక ఓర్వలేకపోతోంది. ప్రజలకు మంచి జరుగుతున్న విషయం తెలిసినా తప్పుడు కథనాలను వండివార్చుతోంది. విషపురాతలతో బురద జల్లుతోంది.

ఏది లాభం?

ప్రభుత్వం అన్ని పీహెచ్‌సీల్లోనూ ప్రసవ సేవలు అందిస్తోంది. ఆస్పత్రిలో ప్రసవానికి చేరినప్పటి నుంచి ప్రసవించే వరకు సకల సదుపాయాలు కల్పిస్తోంది. బాలింతలు, పిల్లలను తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌లో పైసా ఖర్చులేకుండా సురక్షితంగా ఇంటికి చేర్చుతోంది. వీటితో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న విషయాన్ని గ్రహించిన 'ఈనాడు'.. 'బేబీ కిట్లు బయట కొనాల్సిందేనంటూ' మభ్యపెట్టే యత్నం చేసింది. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వం ప్రసవం కోసం ఆస్పత్రుల్లో చేరే గర్భిణులకు ప్రసవం అనంతరం కేవలం రూ.1500లను, రూ.250లు విలువచేసే బేబీ కిట్లను మాత్రమే అందించేది. రూ.1500 కూడా రెండు, మూడు దఫాల్లో రెండు నెలల కాలవ్యవధిలో చెల్లించేది. ఇచ్చిన బేబీ కిట్లలో కూడా నాణ్యత లేకపోవడంతో ఎవరూ సరిగా ఉపయోగించే వారు కాదు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాణ్యత లేని బేబీ కిట్లు ఎవరూ ఉపయోగించడం లేదన్న విషయాన్ని తెలుసుకొని నేరుగా గర్భిణుల ఖాతాల్లో బేబీ కిట్లను కొనుక్కోవడానికి ఇవ్వాలిన మొత్తాన్ని కలిపి రూ.5వేలను ప్రసవం మరుచటి రోజే జమచేస్తోంది. ప్రసవ అనంతర ఖర్చులకు ఈ డబ్బులు ఉపయోగపడుతున్నాయంటూ బాలింతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రిలో గత ఆరునెలల్లో ప్రసవాల సంఖ్య

నెల	ప్రసవాల సంఖ్య
జనవరి	363
ఫిబ్రవరి	390
మార్చి	342
ఏప్రిల్	382
మే	349
జూన్	386

గతంలో కేవలం రూ.1500లు మాత్రమే ఇచ్చేవారు



మూడేళ్ల కిందట బేబీ కిట్లను ఆస్పత్రిలో అందజేసేవాళ్లం. అందులో నాణ్యత సరిగ్గా లేకపోవడంతో ఎవరూ సరిగ్గా వినియోగించుకునే వారు కాదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేశాం. గతంలో కేవలం ప్రసవం అనంతరం రూ.1500లు మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు బేబీ కిట్లు కొనుగోలు చేసేందుకు నగదుతో కలిపి ప్రసవం అనంతరం రూ.5వేలు నేరుగా గర్భిణి ఖాతాలో జమ చేస్తున్నాం.

– డా.బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం

క్లుప్తంగా

ఏపీ ఈసెట్‌లో శ్రీరాములకు 4వ ర్యాంకు


బట్టి శ్రీరాములు

సోంపేట: బట్టిగళ్లూరు గ్రామానికి చెందిన మత్స్యకార యువకుడు బట్టి శ్రీరాములు ఏపీ ఈసెట్‌లో (సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్) నాలుగో ర్యాంకు సాధించాడు. విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో శ్రీరాములు చదివాడు. కుమారుడు ప్రతిభపై తల్లిదండ్రులు బట్టి రేఖారావు దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.

17న చలో విజయవాడ


ధర్నా చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పీఏసీఎస్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 17వ తేదీన నిర్వహించతలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సహకార సంఘాల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రంగనాథ్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.మోహనరావు, బి.రామారావు కోరారు. సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పీఏసీఎస్ ఉద్యోగులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా అనంతరం జిల్లా పరిషత్ గ్రీవెన్స్‌సెల్‌లో జేసీ నవీన్‌కి వినతిపత్రం అందజేశారు.

ఆదిత్యున్ని దర్శించుకున్న సమాచార శాఖ ఆర్జేడీ


మణిరామ్‌కు ఆదిత్యుని జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు

అరసవల్లి:అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని రాష్ట్ర సమాచార శాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.మణిరామ్ కుటుంబసభ్యులతో సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు కలిసి ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను ఆయనకు వివరించారు. తొలిసారిగా స్వామిని దర్శించుకోవడం జన్మధన్యమైందని ఆర్జేడీ మణిరామ్ అన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో సిబ్బంది ఆర్ఆర్ మూర్తి తదితరులు ఉన్నారు.

'5న పాఠశాలల బంద్ పాటించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఈనెల 5వ తేదీన పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు ఏబీవీపీ విద్యార్థి సంఘ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు తుమ్మగంటి వంశీ శ్రీకాకుళం నగర ప్రతినిధులు పవన్, హేమ ప్రసాద్, లవకుమార్, చంద్రశేఖర్‌లతో కలిసి కరపత్రాలను శ్రీకాకుళంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టి.వంశీ మాట్లాడుతు అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడతున్న, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని నినదించారు. ఒకప్పుడు ఫీజులతోనే సరిపెట్టిన కార్పొరేట్ విద్యాసంస్థలు ఇప్పుడు పుస్తకాలు, యూనిఫాం, ఏకరూపు దుస్తులు, స్పోర్ట్స్ దుస్తుల పేరిట దోపీడికి పాల్పడుతూ తల్లిదండ్రులపై మరింత భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 5న అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించి, సహకరించాలని కోరారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి

నందిగాం: గుండెపోటుతో డ్రైవర్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాదఘటన పెద్దలవునిపల్లి జంక్షన్ వద్ద సోమవారం చోటుచేసుకోగా ఐచర్ వ్యాన్ డ్రైవర్ మృతి చెందారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన రాంస్వరూప్ కుమావత్ ఐచర్ వ్యాన్‌లో హోమ్‌గూడ్స్‌ను తీసుకువెళ్తుండగా.. పెద్దలవునిపల్లి సమీపంలోకి వచ్చే సరికి గుండె పోటుకు గురయ్యాడు. వాహనం అదుపుతప్పి టెక్కలి నుంచి పలాస వెళ్లే మార్గంలో వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టబోయాడు . అయితే ఎలాగో అదుపు చేసి వాహనం నిలిపి డ్రైవింగ్ సీటులోనే స్పృహ కోల్పోయాడు. దీంతో మిగతా వాహన దారులు ఆయనను దింపి 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహనం వచ్చేలోపే రాంస్వరూప్ కుమావత్ మృతి చెందాడు. మృతదేహాన్ని టెక్కలి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. రాజస్థాన్‌లో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసినట్లు పోలీసులు చెప్పారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్‌అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రం.. జరభద్రం



- విజృంభిస్తున్న కళ్లకలక వ్యాధి
- బాధపడుతున్న చిన్నారులు, మధ్యవయస్కులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యసిబ్బంది

పోలాకి/టెక్కలి రూరల్: కంటికి ఏసమస్య వచ్చినా ఎర్రగా మారడం సహజం. దుమ్ము, ధూళితోనే కాకుండా సీజనల్‌గా వచ్చే కళ్లకలక (ఇన్‌ఫెక్షన్స్)తో కూడా ఎన్నో ఇబ్బందులు వస్తుంటాయి. ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కళ్ల కలక వ్యాధి విజృంభించింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. పోలాకి మండలంలోని తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలు కళ్లకలక వ్యాధితో ఇబ్బంది పడుతున్నారు. గుప్పెడుపేట, పోలాకి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని గుప్పెడుపేట, కొత్తరేవు, కోడూరు, బెలమరపాలవలస, ప్రియాగ్రహారం, డీఎల్‌పురం, మగతపాడు, తలసముద్రం, అంపలాం, గంగివలస, ధీర్ఘాశి పంచాయతీల్లో కంజెక్టివైటీస్ లక్షణాలను ఇప్పటికే అక్కడి వైద్యసిబ్బంది గుర్తించారు. రాత్రి నిద్రపోయే సరికి బాగానే ఉంటున్నవారు తెల్లవారు లేచే సమయానికి కంటిరెప్పలు అతుక్కుపోయి, వాపుతో పుసులు, నీరుకారుతూ కళ్లు ఎర్రబడిపోతున్నాయి. ఒక్క గంగివలస కేజీబీవీ పాఠశాలలోనే 23 మంది బాలికలు కళ్ల కలకలతో బాధపడుతున్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారు.

కంజెక్టివైటీస్ అంటే..

కంటి గుడ్డు చుట్టూ ఉండే తెల్లని పొర, కంటి రెప్పల వెనుక పొరను కంజెక్టివైటీస్ అంటారు. కళ్లు తెరచి ఉండే సమయంలో దుమ్ము, ధూళి, నీళ్లు, వేడి, చలి తదితరవన్నీ ప్రభావం చూపించవచ్చు. దీంతో ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంటుంది. దాన్నే కళ్లకలక అంటారు. ఈ ఇన్‌ఫెక్షన్ బ్యాక్టీరియా, వైరస్‌తో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. సాధారణ కళ్లకలక వస్తే వారం రోజుల్లో తగ్గిపోతుంది. అదే వైరస్‌తో కూడిన కలకలు వస్తే మూడువారాల వరకు ఉండే అవకాశం ఉంటుందని కంటివైద్యులు చెబుతున్నారు. నవజాత శిశువులు, నెలలోపు ఉన్న చిన్నారుల్లో వస్తే మాత్రం ప్రమాదకరంగా మారుతుంది. కంటిగుడ్డు, కార్నియా వరకు విస్తరిస్తే చూపు మందగిస్తుంది. కలకలు ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపించే ప్రమాదం ఉంది.

అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

అరసవల్లి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో కళ్లకలకలు ఉన్న నేపథ్యంలో విద్యార్థులు, ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి సూచించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోంపేట, కవిటి మండలాల్లో కలకల వ్యాధిగా విస్తృతంగా ప్రబలుతోందన్నారు. ఈ వైరస్ ఒకరినుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతుందని గుర్తుచేశారు. లక్షణాలు కనిపించగానే సమీపంలోని పీహెచ్‌సీని సంప్రదించాలన్నారు. అప్రమత్తంగా ఉండడమే ప్రధాన చికిత్స అన్నారు.

లక్షణాలు..

- కలకలు వచ్చే వారికి కళ్లు ఎర్రగా మారుతాయి
- కంటిలోంచి నీరు కారుతుంది
- కంటి రెప్పలు ఉబ్బిపోవడంతోపాటు మండుతుంటాయి
- నిద్రపోయే సమయంలో కంటి రెప్పలు పుసులు కట్టి అతుక్కోనిపోతాయి
- కలకలు ఒక్క కన్నుకు కూడా రావచ్చు
- కొంత మందికి ఎటువంటి మందులు వాడక పోయిన వారం రోజుల్లో తగ్గిపోతాయి
- కంటి సమస్య రాకుండా యాంటీ బయోటిక్ (టోబ్రమైసిన్) డ్రాప్స్ వాడాలి
- కంటిని తరచూమంచి నీటితో కడుక్కోవడం వలన త్వరగ తగ్గే అవకాశం ఉంటుంది
- కలకలు వచ్చే వారికి మిగిలిన వారు దూరంగా ఉండాలి. వారు వాడిన వస్తువులు వాడరాదు.

యాంటిబయోటిక్ డాప్స్ వాడాలి

కంటికలక ఒకరినుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా బడి వయస్సు పిల్లలు కంటిలో వేలు పెట్టడం వలన వ్యాప్తి తీవ్రత ఎక్కువయ్యే అవకాశాలున్నాయి. కంటి సమస్యలు రాకుండా ఉండేందుకు శుభ్రమైననీటితో కళ్లను రోజుకు నాలుగుసార్లు కడుక్కోవాలి. యాంటిబయోటిక్ డ్రాప్స్ వాడుకోవాలి.

–డాక్టర్ రతన్‌రాజు, వైద్యాధికారి, గుప్పెడుపేట

సిబ్బందిని అప్రమత్తం చేశాం

తీరప్రాంత గ్రామాల్లో ఎక్కువగా వ్యాప్తి చెందివున్న కంజెక్టివైటీస్ కండ్ల కలకలపై సిబ్బందిని అప్రమత్తం చేశాం. అందుబాటులో మందులు విలేజ్ క్లినిక్‌ల్లో ఉన్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు, అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ శ్రీనాధ విజయకుమార్, వైద్యాధికారి, పోలాకి

వైద్యులను సంప్రదించాలి



కళ్ల కలకలు సహజంగా అందరిలోను వస్తుంటాయి. ఇవి అంత ప్రమాదకరమైనవి కావు. వైరస్, బ్యాక్టీరియా, దుమ్ము, ధూళి వంటి వాటి వలన కూడా వస్తాయి. కళ్లు ఎర్రగా మారి దురద, నొప్పి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి మందులు వాడటం మంచిది.

–తేజ్ ప్రవీణ్, కంటి వైద్యుడు, టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి

సీఎంను కలిసిన కలెక్టర్



తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

అపురూపం.. వాసుదేవుని దివ్యరూపం


నిజరూపధారుడైన వాసుదేవుడు


దివ్యాలంకృతుడైన స్వామివారు

భక్తుల కొంగుబంగారం వాసుదేవుడు నిజరూపధారుడై భక్తులకు దర్శనమిచ్చాడు. వేదపండితులు స్వామికి అభిషేకాలు జరిపి.. దివ్యాలంకృతుని కావించారు. వాసుదేవుని జన్మనక్షత్రమైన మూలా నక్షత్రయుతం సోమవారం కావడంతో ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసు కూర్మాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకుని, తన్మయత్వం చెందారు. వ్యాసపూర్ణిమ కావడంతో భక్తులు పెద్ద ఎత్తున దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

–మందస


స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న వేదపండితులు

అదరగొట్టిన హర్షవర్ధన్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరానికి చెందిన అండర్–13 బ్యాడ్మింటన్ క్రీడాకారుడు బీఎల్ హర్షవర్ధన్ సత్తాచాటాడు. గత వారంలో బీహార్ రాష్ట్రం గయాలో జరిగిన యొనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సబ్ జూనియర్స్ అండర్–13 ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్–2023 పోటీల్లో సెమీఫైనల్స్ వరకు పోరాడిన హర్షవర్ధన్ సెమీస్‌లో ఓటమి పాలయ్యాడు. అయితే నేషనల్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో నిలిచి సిక్కోలు కీర్తిని చాటిచెప్పాడు. అండర్–13లో ఈ ఫీట్ సాధించిన మొదటి జిల్లా వాసి కావడం గమనార్హం.

ఎస్‌డీబీఏ హర్షం..

హర్షవర్ధన్ జాతీయస్థాయిలో మూడో ర్యాంక్ సాధించడానికి తోడ్పడిన విక్రాంత్ బ్యాడ్మింటన్ అకాడమీ చీఫ్ కోచ్ కె.విక్రాంత్‌కి, హర్షవర్ధన్ తల్లిదండ్రులకు, అకాడమీ కోచ్ వినయ్‌కి శ్రీకాకుళం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్(ఎస్‌డీబీఏ) తరఫున సంఘ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌డీబీఏ చైర్మన్ నటుకుల మోహన్, కో చైర్మన్ తర్లాడ అప్పలనాయుడు, గౌరవాధ్యక్షుడు అనుమంచిపల్లి వేణుగోపాల్‌రావు, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ దవళ రాజేంద్ర కుమార్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి అజయ్‌కుమార్, కోశాధికారి గండేపల్లి జగన్, ఉపాధ్యక్షులు టి.గణపతిరావు తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నేడు లావేరులో ఉత్తరాంధ్ర తెలగ సంఘం ఆత్మీయ సమ్మేళనం

లావేరు: మండల కేంద్రం లావేరులో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఉత్తరాంధ్ర తెలగ సంఘం ఆత్మీయ సమ్మేళనం జరగనుంది. ఈ విషయాన్ని జిల్లా తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రొక్కం సూర్యప్రకాశరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా దివంగత వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. తెలగ సామాజికవర్గీయులంతా హాజరు కావాలని కోరారు.

కంప్యూటర్ అసిస్టెంటు పోస్టుల మెరిట్ జాబితా విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీపీఎస్సీ ప్రకటించిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన అసిస్టెంటు కం కంప్యూటర్ అసిస్టెంటు అభ్యర్థుల పూర్తి మెరిట్ జాబితాను విడుదల చేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ సోమవారం తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్, కంప్యూటర్ సామర్థ్య పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను కలెక్టర్ కార్యాలయం, అన్ని మండల తహసీల్దారు కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో, శ్రీకాకుళం జిల్లా వెబ్ సైటులో పొందుపరిచామన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల తొమ్మిదో తేదీ ఉదయం పది గంటల నుంచి నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలనకు అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

బూర్జ: రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. ఈ సంఘటన సింగన్నపాలెం–ఉప్పినివలస గ్రామాల మధ్యలో సోమవారం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న మోటార్ సైకిల్, కారు ఢీ కోవడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం వాసుదేవపట్నం గ్రామానికి చెందిన అన్నెపు వినోద్‌కుమార్ (37) ద్విచక్ర వాహనంపై పాలకొండ వైపు నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా.. ఎదురుగా శ్రీకాకుళం నుంచి పాలకొండ వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వినోద్‌కుమార్ గాయపడ్డాడు. 108 వాహనంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రికి క్షతగాత్రుడ్ని తరలించి చికిత్స అందజేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐతమ్ విద్యార్థుల ఆలోచనకు ఎంఎస్‌ఎంఈ ఆమోదం


విద్యార్థులను అభినందిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

టెక్కలి: రైతుల కోసం తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన వినూత్నమైన ఆలోచనకు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) సంస్థ ఆమోదం తెలిపినట్లు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయంలో కలుపు నివారణ కోసం విద్యార్థుల ఆలోచనకు ఆ సంస్థ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఈసీఈ విద్యార్థులు ఎస్.రామ్‌భరధ్వాజ్, కె.సాయిలిఖిత్‌నాయుడు, బి.మురళీకృష్ణ, జి.రోహిత్‌కుమార్ తదితర విద్యార్థులు అధ్యాపకులు జి.సతీష్‌కుమార్, డి.విష్ణుమూర్తి సహకారంతో సోలార్ సాయంతో ఆటోమేటిక్‌గా కలుపు నివారణ ప్రాజెక్టు ఆలోచనకు ఎంఎస్‌ఎంఈ నుంచి ఆమోదం వచ్చినట్లు ఆయన వెల్లడించారు. జాతీయ స్థాయిలో వేల సంఖ్యలో వివిధ ఆలోచనలు పంపగా వాటిలో 276 ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో ఆదిత్య విద్యార్థుల ఆలోచన రూపకల్పన కోసం రూ. 12 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

'ఫీజుల దోపిడీ అరికట్టాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలసముద్రం సూర్యం, జిల్లా అధ్యక్షులు ఎస్.దేవరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలోని ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్ఐఓ పి.దుర్గారావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సూర్యం, దేవరాజు మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులతోపాటు అధిక ధరలకు యూనిఫారాలు, పుస్తకాలు అమ్ముతున్నారని మండిపడ్డారు. వారు వసూలు చేస్తున్న ఫీజులు నోటీస్ బోర్డులో పెట్టాలని, విద్య హక్కు చట్టం ప్రకారం 100 శాతం మంది విద్యార్థులకు 25 శాతం విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని, గాలి వెలుతురు లేని బహుళ అంతస్తులలో తరగతుల బోధన సరికాదని అన్నారు. ఒకే కళాశాల అనుమతితో రెండు మూడు కాలేజీలు నడుపుతున్న కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఆర్ఐఓ దుర్గారావు ప్రభుత్వ నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు.

జర్నలిస్టులకు అక్రిడియేషన్ కార్డుల అందజేత


జర్నలిస్టుకు అక్రిడియేషన్ కార్డును అందజేస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రసార మాధ్యమాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణతో కలిసి జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అక్రిడియేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆ పథకాలను సంబంధిత లబ్ధిదారులు అవగాహన చేసుకుని సద్వినియోగం చేసుకునే ప్రక్రియలో మీడియా పాత్ర కీలకమన్నారు. గత నెల 16వ తేదీన 2023– 24 సంవత్సరానికి జిల్లాలోని వివిధ ప్రింట్.. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు జిల్లా మీడియా అక్రిడియేషన్ కమిటీ 302 కార్డులు మంజూరు చేసింది. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి.రమణ, డీపీఆర్వో బాలమాన్ సింగ్, మీడియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంటైనర్ లారీ బోల్తా

- తప్పిన పెను ప్రమాదం


బోల్తాపడిన కంటైనర్ లారీ

ఇచ్ఛాపురం: ఐరన్ రోల్‌తో వెళ్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి జాతీయ రహదారిపై బోల్తాపడింది. అయితే ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా నుంచి చెన్నైకి ఐరన్ షీట్‌రోల్ లోడుతో సోమవారం కంటైనర్ లారీ వెళ్తుంది. జాతీయ రహదారి–16పై ఇచ్ఛాపురం పాత టోల్‌ప్లాజా సమీపంలోకి వచ్చేసరికి వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో అందులో ఉన్న 25 టన్నుల బరువైన ఐరన్ షీట్ రోల్ దొర్లుకుంటూ రోడ్డుపైకి వచ్చేసింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో రహదారిపై ఎటువంటి రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే హైవే పెట్రోలింగ్ పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఐరన్ షీట్ రోల్‌ని క్రేన్ సహాయంతో తొలగించారు.

ఉత్సాహంగా జిల్లా స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు, స్విమ్మింగ్‌పూల్‌కు హాజరైన బాలలతో హరికాప్రసాద్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సబ్–జూనియర్స్ బాలబాలికల స్విమ్మింగ్ ఎంపికలు సోమవారం ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్ వేదికగా జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 100 మంది వరకు బాలబాలికలు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ ఎంపికల్లో రాణించిన క్రీడాకారులను ఈ నెల 8, 9 తేదీల్లో గుంటూరులోని నరసారావుపేటలో జరగనున్న 8వ ఏపీ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎస్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. సాయంత్రం తుది జాబితాను వెల్లడించారు. రాష్ట్రపోటీలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని హరికాప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు డి.మురళీధర్, ఎస్.కాంతారావు, సంఘ ప్రతినిధులు, క్రీడాకారుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే: గ్రూప్–1లో వీడీ ధరహాస్. గ్రూప్–2లో ఎం.నితీష్, టి.ప్రేమ్‌కుమార్, కె.ధైర్య, హేమంత్, డి.షణ్ముఖ్ రాజ్, దీక్షాబెహరా. గ్రూప్–3లో వై.బోణీఅశ్వద్, ఎం.రోహన్‌శ్రీవాత్సవ్, ఎస్.ప్రణీత్, బి.అన్సుల్‌రాజ్, ఎం.పురంధరి, సీహెచ్ సుశాంత్, పి.అవినాష్ ఎంపికైన వారిలో ఉన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వారిపై ఎస్పీకి ఫిర్యాదు

- న్యాయం చేయాలని విలేకరి విజ్ఞప్తి

శ్రీకాకుళం క్రైమ్: తనపై హత్యాయత్నానికి పాల్పడిన కొల్ల చిరంజీవులు, దిలీప్‌లను అరెస్టు చేసి న్యాయం చేయాలని సుంకర శాంతభాస్కర్ (సాక్షి జలుమూరు విలేకరి) కోరారు. ఈ మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరావు వద్ద మొరపెట్టుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నరసన్నపేట మండలం కొల్లవానిపేట గ్రామంలో నివసిస్తున్న శాంత భాస్కర్ ఈ మేరకు ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి కొల్ల చిరంజీవులు, అతని కుమారుడు దిలీప్ (చిన్న) గత నెల 29వ తేదీన తనపై దాడి చేసినట్టు వివరించారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ.. కొల్లవానిపేటలో తన ఎనిమిది సెంట్ల జిరాయితీ భూమి (మట్టిదిబ్బ) పక్కన చిరంజీవులు పొలం ఉండటంతో ఏటా పంటల సమయంలో దిబ్బను తవ్వి అతని పొలంలో కలిపేస్తున్నట్టు తెలిపారు. ముందుగానే గత నెల 27వ తేదీన వారిని కలిసి ఈసారి దిబ్బని తవ్వవద్దని చెప్పడం జరిగిందన్నారు. 29వ తేదీన పథకం ప్రకారం తండ్రీకొడుకులిద్దరూ తనను పొలం వద్దకు రమ్మని చెప్పడంతో వెళ్లగా.. దుర్భాషలాడుతూ కర్రతో దాడి చేసి గాయపర్చినట్టు పేర్కొన్నాడు. తల వెనుక భాగం గాయమవ్వడంతో పాటు ఎడమకంటి పొరలు, నరాలు చిట్లి కంటి చూపు పోయిందని భాస్కర్ వివరించారు. గ్రామస్తుల సాయంతో నరసన్నపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స చేశారన్నారు. మరుసటి రోజు శ్రీకాకుళం రిమ్స్‌కి రిఫర్ చేయడంతో అక్కడికి చేరి వైద్యపరీక్షలు చేయించుకున్నట్టు చెప్పారు. అయితే వైద్య పరికరాలు లేనందున విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయడంతో అక్కడకు వెళ్లగా వారు రీజినల్ కంటి ఆస్పత్రికి పంపించారన్నారు. ఇంత జరిగినా నిందితులిద్దరిని కనీసం అరెస్టు చేయకుండా 324 వంటి చిన్న సెక్షన్‌తో సరిపెట్టారని బాధితుడు వాపోయాడు. దీనిపై తక్షణమే స్పందించిన అడిషనల్ ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు నరసన్నపేట ఎస్ఐ సింహాచలంతో మాట్లాడి తండ్రీకొడుకులపై విచారణ చేయాలని, వారిపై ఉన్న పాత కేసులనూ విచారించి వారం రోజుల్లో స్పష్టమైన నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పోలీసు శాఖ నుంచి తప్పక న్యాయం చేస్తామని భాస్కర్‌కు హామీ ఇచ్చారు.